క్లుప్తంగా

ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ



గురజాల : అందరికి నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయివీరారెడ్డి అన్నారు. నగర పంచాయతీలోని సచివాలయం–1లో మంగళవారం ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డులను అందించడం జరుగుతుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మరికొన్ని వ్యాధులు ఈ పథకం కిందకు వచ్చే విధంగా శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, చల్లా కాశీబాబు, షేక్ నాగులుమీరా, తదితరులున్నారు.

అయ్యప్పస్వామి పూజలు



రెంటచింతల: అన్నం పరబ్రహ్మ స్వరూపమని వివిధ స్వామి మాలలు ధరించిన మాలధారులకు అన్నదానం(సద్ది) చేయడం పుణ్యఫలమని సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం చైర్మన్ గురుస్వామి బొద్దూరి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మల్లికార్జునస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ, జిగురు చంద్రశేఖర్ శర్మ నేతృత్వంలో అయప్ప ఆలయంలో పూజా కార్యక్రమాలను, హోమాలను నిర్వహించారు. అయ్యప్ప సేవాసమితి మండపంలో స్వాములకు బద్దూరి కార్తీక్ వేదాంరెడ్డి, దేవరశెట్టి దుష్యంత్, బద్దూరి బ్రహ్మనందరెడ్డి అన్నదానం(సద్ది) నిర్వహించారు. 18 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా 51 రోజుల పాటు ఈ అన్నదానం చేపడుతున్నట్లు వారు తెలిపారు.

లైమ్‌సిటీలో పొగమంచు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఎప్పుడు సున్నపు పరిశ్రమతో లైమ్ సిటీగా పేరు ఉండేది. కానీ నేడు పొంగమంచుతో పిడుగురాళ్ల పట్టణం దర్శనమిస్తుంది. ఉదయం సమయంలో 11 అయినా సరే చలి పంజా వదలకపోవటంతో రైల్వే స్టేషన్, బస్టాండ్ వద్ద ప్రయాణికులు, ప్రజలు అల్లాడిపోతున్నారు.

మహిళపై దాడి

పిడుగురాళ్ల: చీటీపాట నగదు అడిగినందుకు మహిళపై భార్యభర్తలు దాడి చేసిన ఘటన పట్టణంలోని లెనిన్‌నగర్‌లో జరిగిందని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. జూలకల్లు గ్రామానికి చెందిన షేక్ బాజీబీ పిడుగురాళ్ళ పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన మున్నీ వద్ద లక్ష రూపాయల చీటీపాట వేసింది. అయితే బాజీబీ ఆగస్టు నెలలో పాట పాడుకుంది. రూ.లక్షకుగాను రూ.63 వేలు చీటి నిర్వాహకురాలు మున్నీ ఇవ్వాల్సి ఉంది. ఆ నగదు ఇవ్వాలని నవంబర్ 29న అడిగేందుకు వెళ్లటంతో నిర్వాహకురాలు మున్నీ, అతని భర్త ఫరీదులు కలిసి బాజీబీపై దాడి చేసి గాయపరిచారని స్పందనలో ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా విచారణ నిర్వహించి కేసు నమోదు చేయటం జరిగిందని సీఐ తెలిపారు. పట్టణ ఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పిడుగురాళ్ల: మండలంలోని జానపాడు గ్రామంలో ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎండీ ప్రదీప్ చక్రవర్తి ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పురస్కరించుకొని పేదలకు దుస్తులు పంపిణీ చేయడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ డైరెక్టర్ టి.వెంకటరావు, గడిపూడి మల్లిఖార్జునరావు, బుజ్జి పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

రాకేష్‌కు 'తెలుగు జాతీయ అకాడమీ పురస్కారం'

నరసరావుపేట: శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలలో తనకు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ జాతీయ పురస్కారం అందజేశారని గుండాల రాకేష్ మంగళవారం వెల్లడించారు. దేశవ్యాప్తంగా కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, సాహితీ వేత్తలు, ప్రముఖులు హాజరై 30 గంటల పాటు కళా ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు, రంగస్థల ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హోం శాఖమాత్యులు తానేటి వనిత, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోల్ల శ్రీలక్ష్మి, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే నాని హాజరయ్యారన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభకు వేదికలు

- పలు చోట్ల మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

రెంటచింతల: వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఎగ్జిబిషన్)ల ద్వారానే విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని మండల విద్యాశాఖాధికారి-1 వేముల నాగయ్య అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ నాగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో అనేక దేశాలు సైన్స్ ద్వారానే పలు ఆధునిక పరికరాలను కనుగొని అగ్ర రాజ్యాలుగా వెలుగొందుతున్నాయన్నారు. సైన్స్ చుట్టూ ప్రపంచం పయనిస్తుందనే విషయాన్ని విద్యార్థులు గమనించాలని ప్రతి విద్యార్థిలో కూడా ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గమనించి వారిని ప్రోత్సహించినప్పుడు ఆయా రంగాలలో రాణించగలుగుతారన్నారు. ఎంఈవో-2 శివనాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ నైపుణ్యంతో ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వాటి నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఉపాధ్యాయుల కేటగిరీ నుంచి లూథరన్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎంవీ పద్మలత, వక్తిగత విద్యార్థి విభాగంలో జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన పి.హారిక, విద్యార్థి గ్రూపు (బృందం) కేటగిరీలో ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన నాగరాజు నాయక్, వెంకటేశ్వర్లునాయక్ ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓర్సు సాగరరాజు, గుజ్జుల లింగారెడ్డి, సీహెచ్ నాసరయ్య తదితరులున్నారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వైజ్ఞానిక ప్రదర్శనలతో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఎయిడ్స్‌ని నిర్మూలిద్దాం అంటూ ప్రదర్శిస్తున్న విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

దాచేపల్లిలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

దాచేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం నిర్వహించారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ హైస్కూల్స్ నుంచి విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. సైన్స్ విశిష్టతను తెలిపేలా పలు వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. పలువురు ఉపాధ్యాయులు కూడా ఈ ప్రదర్శనను తిలకించారు. మండలస్థాయిలో విజేతలైన విద్యార్థులను జిల్లా స్థాయిలో జరిగే ఎగ్జిబిషన్‌కి పంపిస్తారు. ఎంఈవోలు రాజకుమారి, పినాకపాణి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, సీఆర్పీలు అబ్రహాం, వెంకటేశ్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి



వెల్దుర్తి: విద్యార్థులు, విద్యార్థి దశ నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవింద రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో రామకృష్ణ సేవా సమితి వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు రామకృష్ణ మఠం, రాజమండ్రి వారి ఆధ్వర్యంలో మాచర్ల నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలో జాగృతి పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేయటం జరిగింది. స్వామి వివేకానంద మిషన్‌ను స్థాపించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పోటీలు నిర్వహించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సామినేని వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు మరింత సేవా దృక్పథంతో పని చేయాలి


- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- నియోజకవర్గంలోని వలంటీర్లతో సమావేశం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన నాయకులు

సత్తెనపల్లి: ఏ రాష్ట్రంలోనూ ఎవ్వరూ చేయని విధంగా ప్రతి పథకం, ప్రతి పని పేదల కోసమే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత చేస్తున్నారని, వలంటీర్లు మరింత సేవా దృక్పథంతో పని చేసి వాటిని ప్రజలకు చేరువ చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని వలంటీర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తుందన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు వలంటీర్ వ్యవస్థను చిన్నచూపు చూస్తూ అవహేళనగా మాట్లాడారని, అదే వలంటీర్ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గడ గడ లాడించిన కోవిడ్‌ను సైతం అధిగమించారన్నారు. ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎక్కువ మంది రక్తదానంలో భాగస్వాములయ్యేలా వలంటీర్లు చూడాలన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఏటా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జనవరి 3 నుంచి చేపట్టే ఈ బృహత్తర కార్యక్రమంలో వలంటీర్లు అందరూ భాగస్వాములై ఎక్కువ మంది మహిళలు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకొని ముగ్గుల పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్‌లు మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, సత్తెనపల్లి ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండల పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీను, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, బండి మల్లికార్జునరెడ్డి, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రాజుపాలెం ఆర్ అండ్ ఆర్ సెంటర్‌లో తొట్టిని పరిశీలిస్తున్న జిల్లా అధికారి, సిబ్బంది

రాజుపాలెం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని లోతట్టు ప్రాంతాలలో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జిల్లా శాఖాధికారి రవీంద్ర రత్నాకర్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మంగళవారం ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో జరిగే రక్త పరీక్షలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామాలలో పర్యటించి మురికి నీరు నిల్వ ఉన్న తొట్టెలను, గుంటలను పరిశీలించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి నీరు నిల్వ ఉండడం వలన దోమలు వ్యాప్తిచెంది మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు సంభవిస్తాయని, ప్రతీ ఒక్కరు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, హెల్త్ అసిస్టెంట్ హుస్సేన్, భరత్, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మీ, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్



గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న అధికారులు, నాయకులు

నాదెండ్ల: ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని ఎండుగుంపాలెం, ఇర్లపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు గోరంట్ల కోటేశ్వరరావు, మంగు రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. పథకాలను అర్హులైన లబ్ధిదారుల దరి చేర్చేందుకు స్థాని క అధికారులు కృషి చేయాలన్నారు. అర్హులైన గృహిణులకు ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్‌లను అందించారు. కార్యక్రమంలో గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్‌నాయక్, ఎంఈవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు ప్రశాంతి, ఎస్.మాధవి, బీజేపీ జిల్లా కార్యదర్శి కస్తూరి వెంకటేశ్వర్లు, గణపవరం సొసైటీ చైర్మన్ మంగు ఏడుకొండలు, నాయకులు పర్వతనేని బ్రహ్మయ్య, సూరె బుచ్చయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆదర్శ కాలనీలో పేదలకు చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ద్వారా నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. కాలనీలో పేదలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు, పల్నాడు హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

23న ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

క్రోసూరు: మండలంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులపై ఈనెల 23న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించబడుతుందని ఎంపీడీవో బి.మహేష్‌బాబు మంగళవారం తెలిపారు. మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన రూ.4.5 కోట్లు పనులు, పంచాయతీరాజ్ పనులు రూ.3.5 కోట్లు తాలూకు సామాజిక తనిఖీలు నిర్వహించటం జరిగిందన్నారు. వాటిపై మండల స్థాయిలో స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ గంగవరపు జోసఫ్, ఏపీడీ పొత్తూరు వెంకటనారాయణ పాల్గొంటారని తెలిపారు.

కంకణాలపల్లిని సందర్శించిన పరిశీలకుడు

సత్తెనపల్లి: రానున్న ఎన్నికలను పురస్కరించుకొని ఓటర్ నమోదులో భాగంగా చేర్పులు, తొలగింపుల క్లెయిమ్స్ ఏవిధంగా చేస్తున్నారనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఎస్‌ఎస్‌ఆర్-2024 పరిశీలకుడు బి.శ్రీధర్ సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చేర్పులు, తొలగింపులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో బీఎల్‌ఎన్ రాజకుమారి, తహసీల్దార్ ఎస్.సురేష్, బీఎల్వోలు, ఉన్నారు.


ఉద్యాన పంటల పరిశీలన

బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు, ఘాటితండాలను సందర్శించి పొలంలో మిరప పంటను వినుకొండ ఉద్యాన శాఖ అధికారి ఎస్‌కె నబీరసూల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప సాగు రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అధిక వర్షాల వలన పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. పొలంలో నీరు నిలువ లేకుండా చూడాలని సూచించారు. పంటను ఆశించు ఆకు మచ్చ, బూడిద తెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలు గురించి తెలిపారు. బ్యాక్టీరియా, ఆకుమచ్చ కనోఫోరా వంటి తెగుళ్ల నివారణ పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు పరిశీలన

నాదెండ్ల: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటల నష్టం అంచనా వివరాలను నరసరావుపేట మండల ఏవో వరలక్ష్మి పరిశీలించారు. మండలంలోని గణపవరం గ్రామంలో నాలుగు సచివాలయాల పరిధిలో సిబ్బంది ఈ నెల 8 నుంచి పంట నష్టం వివరాల నమోదు ప్రక్రియ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరలక్ష్మి బృందం పంటల నమోదును తనిఖీ చేశారు. ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో దెబ్బతిన్నాయో పరిశీలించారు. ఏఈవోలు నమోదు చేస్తున్న వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాల నమోదు సక్రమంగా జరుగుతుందా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఈవోలు శేషు ఉన్నారు.

జాతీయ క్విజ్ పోటీలకు ఎంపిక



నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ మంగళవారం అభినందించారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్‌కె అంజుమ్ గౌస్య, బి.లక్ష్మీ నాగశ్రావ్యలు నేషనల్ ఏజేడీఎస్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన క్విజ్ పోటీలలో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 21వ తేదీ ముంబైలో జరిగే జాతీయస్థాయి పోటీలలో విద్యార్థినులు పాల్గొంటారు. విద్యార్థినులను, గైడ్ టీచర్ పి.అనితను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ మధుకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సులేఖ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు



నాగులవరంలో గులాబీ తోటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

విజయపురిసౌత్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. మంగళవారం మాచర్ల మండలంలోని నాగులవరం గ్రామంలో ఉద్యావవన శాఖ ఆధ్వర్యంలో వేసిన గులాబీ, బంతిపూల తోటలను, మిర్చి పంటను ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎకరం పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. వ్యవసాయం చేసేందుకు అవసరమైన సేవలన్నీ అన్నదాత ఇంటి ముందుకే వస్తున్నాయన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ప్రభుత్వం సరఫరా చేస్తుండటంతో అన్నదాతలు ఆనందంగా వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రైతులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఎంపీపీ బూడిద మంగమ్మ, ఏవో లక్ష్మారెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్ రెడ్డి (చిన్నా) మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ ఐనబోయిన శ్రీనివాసరావు, వీఏ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తదితరులు

వెల్దుర్తి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి గ్రామీణ పథకం పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పాల్గొని సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై డిసెంబర్ 4 నుంచి 18వ తేదీ వరకు గ్రామాలలో సామాజిక తనిఖీలు నిర్వహించి మంగళవారం ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక బృందాలు గ్రామ సభలు నిర్వహించారు. 20 గ్రామ పంచాయతీల పరిధిలో 300 పనులకు గాను రూ.4,76,58,776 వేతన రూపంలో, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 62 పనులకు రూ.3,43,86,197, ఎస్ఎస్ఏ కింద రూ.3,53,705పై సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ పనులలో రూ.2,81,047 రికవరీ చేసేందుకు ఆదేశాలిచ్చారు. వివిధ పనుల్లో రూ.26,000 జరిమానా విధించారు. మొక్కల పెంపకంలో రూ.2,81,509పై విచారణకు ఆదేశాలిచ్చారు. మొక్కలు ఎండిపోయిన స్థానంలో మరలా మొక్కలు నాటేందుకు రూ.1,48,871గా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జె.సురేంద్రకుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ విజయకుమారి, ఎంపీడీవో డి.ప్రసాద్, ఏపీవో రేఖా జ్యోతి, స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య, ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రూప్లీబాలునాయక్, టీఏలు, ఎఫ్ఏలు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు అసోసియేషన్ అండగా ఉంటుంది



విశ్రాంత ఉద్యోగిని సన్మానిస్తున్న దృశ్యం

దాచేపల్లి : విశ్రాంత ఉద్యోగులు ఐకమత్యంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చింతారెడ్డి కోదండరామిరెడ్డి అన్నారు. అసోసియేషన్ 20వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం మంగళవారం నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో జరిగింది. అసోసియేషన్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదించారు. పలువురు విశ్రాంత ఉద్యోగులు కోదండరామిరెడ్డి, రామిరెడ్డి, శ్రీధర్‌శాస్త్రి, ఇస్మాయేల్, దానమ్మ, సైదయ్యలను సన్మానించారు. విశ్రాంత ఉద్యోగులకు అసోసియేషన్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బుర్రి కృష్ణారెడ్డి, సాంబశివరావు, సాంబశివారెడ్డి, నర్సయ్య, జయభారతి, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం

- ఉన్నవ, మర్రిపాలెం గ్రామాల్లో బోర్లు, మోటార్లు ఏర్పాటు
- రూ.9 లక్షల మండల నిధులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఉన్నవలో బోరు పనుల పరిశీలనకు వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు

యడ్లపాడు: రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలతో తాగు నీటి పనులను నిర్వహిస్తున్నారు. మండలంలోని ఉన్నవ, మర్రిపాలెం గ్రామాల పరిధిలో మండల పరిషత్ నిధుల నుంచి 8 బోర్లు, వాటిలో రెండు బోర్లకు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.9 లక్షల అంచనా వ్యయంతో ఉన్నవలోని గళ్లా వారి వీధి, బ్రహ్మంగారి గుడి, సూర్యనగర్ కాలనీ, ఉదయపురి కాలనీ, క్రిష్టయపాలెం, మర్రిపాలెం పరిధిలో కల్పన క్రషర్ సమీపంలో బోర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నవలోని సీతారామపురం, నాయుళ్ల బజారు మినహా మిగిలిన అన్ని చోట్ల బోర్లు వేయడం పూర్తయింది. ఆయా పనులను మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిడతల దయాసాగర్, గుర్తి సింగయ్య, పందుల బుల్లెబ్బాయ్, కొప్పుల శ్యామ్యేల్‌పాల్, వలేటి ఉదయ్‌కిరణ్, బింజు సాంబశివరావు, ప్రత్తిపాటి వేణు పరిశీలించారు.

ఆరోగ్య శ్రీ నూతన కార్డుల పంపిణీ



మూగచింతలపాలెంలో నూతన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

బొల్లాపల్లి: మండలంలోని మూగచింతలపాలెం సచివాలయం వద్ద డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ నూతన కార్డుల పంపిణీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సచివాలయ పరిధిలో మంజూరైన ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. సచివాలయం పరిధిలో 832 కార్డులు మంజూరయ్యాయి. అనంతరం వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కృష్ణానాయక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కే జిలానీబాషా మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్డుల పంపిణీతో పాటు లబ్ధిదారుడికి ఈకేవైసీ తప్పనిసరన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మేలు జరిగే విధంగా పథకంలో మరిన్ని మార్పులు తెచ్చారని, గతంలో ఐదు లక్షల నుంచి ప్రస్తుతం రూ.25 లక్షలు వరకు ఆరోగ్య శ్రీ ద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. కాన్సర్‌తో పాటు పలు రకాలు వ్యాధులకు ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స పొందవచ్చని, ఈ కార్డు ద్వారా పేదలు ఓపీ వైద్యసేవలు సైతం పొందే అవకాశం ఉందని, లబ్ధిదారుడు సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. 2285 ప్రైవేటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలు వైద్యసేవలు పొందవచ్చన్నారు. ఈ వైద్యశాలలో 3257 చికిత్సలకు వైద్యం అందుతుందని వివరించారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఆసరా ద్వారా 1519 చికిత్సలకుగాను ప్రతిరోజు రోగికి రూ.225 వంతున చెల్లించడం జరుగుతుందని, నెలకు ఐదువేల రూపాయలు ఆసరా ద్వారా ఆరోగ్య శ్రీ వైద్య సేవలు పొందని రోగికి అందుతాయని తెలిపారు. వి.సాయితేజ, వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లా గిరిబాబు, ఎం.రాజయ్య, డి.గోవిందునాయక్, ఆర్.కృష్ణా నాయక్, బి.గురవయ్య, పి.అవినాష్ రెడ్డి, కె.బంగారయ్య, ఎం.నవసరయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.